## క్లుప్తంగా

### సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

టెక్కలి: ఎన్నికల నేపథ్యంలో టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ నిబంధనల ఉల్లంఘనతో పాటు ఇతర ఫిర్యాదుల కోసం 90637 57478 నంబర్‌ను సంప్రదించాలని కార్యాలయ సిబ్బంది సూచించారు.

### వేడుకగా ఆలయ ప్రతిష్ఠ



విశేష పూజలు చేస్తున్న పండితులు

ఇచ్ఛాపురం రూరల్: సన్యాసిపుట్టుగ గ్రామంలోని కల్యాణ వెంకటేశ్వర ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. శ్రీకూర్మ క్షేత్ర మహాపండితులు గోపీనంబాల నల్లకూర్మన్న (దాసుబాబు) ఆధ్వర్యంలో యాగశాలార్చనలు, మండపారాధనలు, క్షీరాధివాసం, విశేష హోమం, బలిహరణం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

### సేవాభావాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

మందస: విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలని మందస ఎస్‌ఐ బి.అనిల్‌కుమార్ అన్నారు. ఉద్దాన ప్రాంతమైన నారాయణపురం పంచాయతీలోని చిన్నకేశుపురం, బంజిరికేశుపురం గ్రామాల్లో ప్రత్యేక జాతీయ సేవా పథకం శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు సేవాభావం కూడా కలిగి ఉండాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు ఎన్.రామకుమార్, బి.శాంతారావు, ఏవో బి.శివ పాల్గొన్నారు.

### లోక్ అదాలత్ ద్వారా 155 కేసులు పరిష్కారం

టెక్కలి: టెక్కలి కోర్టు సముదాయంలో ఇటీవల నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 155 కేసులు పరిష్కారమయ్యాయి. ఈవిషయాన్ని కోర్టు వర్గాలు సోమవారం ఓ ప్రకటన పేర్కొన్నాయి. ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత నేతృత్వంలో ఈ కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. సివిల్ దావాలు ఐదు, క్రిమినల్ కేసులు 15, ఎస్‌ఈబీ కేసులు 20, ప్లీబార్గయినింగ్ ద్వారా రాజీ చేసినవి 111, చెక్ బౌన్స్ కేసు ఒకటి, మనోవర్తి ఒకటి, బ్యాంక్ పీఎల్‌సీలు రెండు.. తదితర కేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఈ కేసుల ద్వారా 12,43,330 రూపాయలు సెటిల్‌మెంట్ చేసినట్లు ప్రకటనలో వెల్లడించారు.

### ప్రిన్సిపాల్‌గా సుశాంత్‌కుమార్‌జెన్నా



సుశాంత్ కుమార్ జెన్నా

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒడియా అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న సుశాంత్ కుమార్ జెన్నా ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపొందారు. ఈయన మన్యం పార్వతీపురం జిల్లా సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రబీన్‌కుమార్‌పాఢీ తెలిపారు. కళాశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుశాంత్‌కుమార్‌జెన్నాను సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ నిత్యానందపట్నాయక్, అధ్యాపకులు శ్రీనివాసరావు, దుర్యోధన, సంతోష్‌కుమార్, శివకుమార్, త్రిపాఠీ పాల్గొన్నారు.

### గేట్ ర్యాంకర్‌కు సత్కారం



నీలాద్రిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆబోతు నీలాద్రి నిరూపించారని ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం సూర్యప్రభాకరరావు అన్నారు. గేట్-2024 పరీక్షలో ఆలిండియా స్థాయిలో 343వ ర్యాంకు సాధించిన నీలాద్రిని స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సోమవారం సత్కరించారు.

### జీడి మామిడిపై నేడు సెమినార్

పలాస : జిల్లాలో విస్తారంగా సాగవుతున్న జీడి మామిడిపంటపై మంగళవారం ఉదయం 10గంటలకు పలాస పీసీఎంఏ కార్యాలయంలో జిల్లా స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్టు పలాస ఉద్యాన వన శాఖాధికారి శంకర్‌దాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సెమినార్‌కు శాస్త్రవేత్తలు హాజరవుతున్నారని తగిన సలహాలు సూచనల కోసం రైతులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

# పది పరీక్షలు ప్రారంభం

● తొలి రోజు ప్రశాంతం



టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లను సరిచూసుకుంటున్న విద్యార్థులు

టెక్కలి: విద్యార్థుల ఉన్నత చదువులకు ఆధారమైన పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. టెక్కలి పట్టణంలో ఎంజేపీ ఏపీ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, ఆర్‌సీఎం, తలగాం ఎట్ నౌపడ ఆర్‌ఎస్ పాఠశాలల్లో కేటాయించిన కేంద్రాల్లో 829 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 799 హాజరయ్యారు. 30 మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు.

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో కురమాన అప్పారావు తెలిపారు. 1499 మంది విద్యార్థులకు ఆరు కేంద్రాలను కేటాయించగా..19 మంది గైర్హాజరైనట్టు చెప్పారు.

ఇచ్ఛాపురం: పట్టణంలోని నాలుగు కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వోన్నత పాఠశాల, మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, ఆదర్శపాఠశాల, స్వర్ణభారతి పాఠశాల కేంద్రాల్లో 898 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 890 మంది హాజరైనట్టు ఎఈవో కె.అప్పారావు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు ఎన్.విశ్వనాథం, బి.వి.పావనీకుమారి, డి.వైకుంఠరావు, బి.తమ్మయ్య సీఎస్‌లుగా, నరేంద్రనాథ్‌పట్నాయక్, సరోజిని, వెంకటరమణ, బి రామారావు డీవోలుగా వ్యవహరించారు..

కంచిలి: మండలంలో నాలుగు కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్షలు ప్రారంభమయ్యాయి. కంచిలి ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కేంద్రంలో 177 మంది హాజరవ్వాల్సి ఉండగా 164 మంది, జేఎంజే ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 242 మందికి 228 మంది, మఠం సరియాపల్లి ఏపీ మోడల్ స్కూల్ కేంద్రంలో 248 మందికి 241 మంది, మఠంసరియాపల్లి జడ్పీహెచ్‌ఎస్ కేంద్రంలో 122 మందికిగాను 118 మంది హాజరయ్యారు. ఎంఈఓలు ఎస్.శివరాం ప్రసాద్, కె.చిట్టిబాబులు పర్యవేక్షించారు.

సోంపేట: మండలంలో ఏడు కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. 1110 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1101 మంది హాజరయ్యారు. ఎంఈవోలు ఎస్.జోరాడు, కృష్ణంరాజు కేంద్రాలను పర్యవేక్షించారు.

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని ఐదు కేంద్రాల్లో ప్రారంభమైన పరీక్షలకు 957 మంది హాజరు కావాల్సి ఉండగా.. 28 మంది గైర్హాజరయ్యారు. నగరంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో 280 మందికి 256, పాతటెక్కలి జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో 172 మందికి 170, జెడ్పీహెచ్ గోవిందపురం కేంద్రంలో 258 మందికి 257, అక్కుపల్లి-2లో 150 మందికి 149, అక్కుపల్లి-1లో 97 మందికి 97 మంది హాజరైనట్టు ఎంఈవో దాశరధి తెలిపారు.

పలాస: పలాస మండలం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఎనిమిది కేంద్రాల్లో పరీక్షలు ఆరంభమయ్యాయి. 1682 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 58 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు.




ఇచ్ఛాపురం రూరల్: పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలంలో ఐదు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. కోటబొమ్మాళి హైస్కూల్‌లో రెండు, బాలికల హైస్కూల్, నిమ్మాడ, తిలారు హైస్కూల్‌లో ఒక్కో కేంద్రాన్ని కేటాయించారు. వీటిలో 775 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. ఆరుగురు గైర్హాజరయ్యారని ఎంఈవో-1 ఎస్.అప్పలరాజు తెలిపారు.



ఇచ్ఛాపురం: ప్రభుత్వోన్నత పాఠశాల కేంద్రానికి వస్తున్న విద్యార్థులు



కంచిలిలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



సోంపేట కేంద్రంలో డిస్‌ప్లేబోర్డులో నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

## 20 నుంచి వల్లభనారాయణుని డోలోత్సవాలు



వల్లభనారాయణస్వామి



స్వామివారి ఆలయం

మందస: మండలంలోని ఉద్దాన గ్రామమైన రట్టిలో వల్లభనారాయణుని డోలోత్సవం నిర్వహణకు కమిటీసభ్యులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. యాత్ర ఐదు రోజులు జరుగుతున్నప్పటికీ.. మూడు రోజుల పాటు భక్తులు భారీగా తరలివస్తారు. ఏటా శివరాత్రి 12 రోజుల తరువాత స్వామి వారి డోలోత్సవాలను నిర్వహించడం పరిపాటి. అందులో భాగంగానే ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు స్వామి డోలోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సింహాచలం పుణ్యక్షేత్రంలో వెలసిన సింహాద్రి అప్పన్న, రట్టిలో వెలసిన వల్లభనారాయణస్వామిని ఒక్కటిగా చెప్పుకునే భక్తులు ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచే కాక ఒడిశా రాష్ట్రం నుంచి కూడా భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు.

కార్యక్రమ వివరాలు..

డోలోత్సవాలు దేవదాయశాఖ ఆధ్వర్యంలో వివేకానంద యువజన సేవా సంఘం సహకారంతో నిర్వహిస్తారు. ఈ నెల 20న రాత్రి తొమ్మిది గంటలకు అంకురార్పణ చేస్తారు. 21న మఖా కామదహనం, 23న ప్రత్యేక పూజలు, స్వామివారి దర్శనాలు, 25న డోలోపూర్ణిమ, సముద్రస్నానం, కోలసేవ జరుగుతుంది.

పలాస డిపో నుంచి ప్రత్యేక బస్సులు

రట్టి వల్లభనారాయణస్వామి యాత్రకు పలాస ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా బస్సులు నడుపుతారు. మూడు రోజుల పాటు పలాస-హరిపురం-రట్టి, మందస-హరిపురం-రట్టి, సోంపేట-హరిపురం-రట్టిలను కలుపుతూ రట్టి యాత్ర స్పెషల్ పేరుతో బస్సులు తిరుగుతాయి.

## ఎల్లమ్మను దర్శించుకున్న మంత్రి కుటుంబ సభ్యులు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలో జరిగిన జామి ఎల్లమ్మ యాత్ర సందర్భంగా అమ్మవారిని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, శ్రీదేవి, కుమారులు అరవ్, ఆర్నవ్‌లు ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. ఎల్లమ్మకు పసుపు, కుంకుమ, ముత్తయిదువు పూజాద్రవ్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



ఎల్లమ్మ మందిరంలో హారతి తీసుకుంటున్న మంత్రి కుటుంబ సభ్యులు

## ఎమ్మెల్సీ రామారావు పరామర్శ



ఎరామర్మలో రామారావు దంపతులు

కంచిలి: కవిటి మండలం ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన పూడి శ్రీక్రిష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. అతని కుటుంబ సభ్యులను స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు, చామంతి దంపతులు సోమవారం పరామర్శించారు. ధైర్యం చెప్పి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారితోపాటు బెందాళం శోభన్‌బాబు ఉన్నారు.

## 'నీ ఓటు..నీ భవిష్యత్తు'తో అవగాహన



ఇచ్ఛాపురంలోని బ్యాంకు వద్ద వాల్‌పోస్టర్ అతికిస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: ఎన్నికల కమిషన్ (ఈసీ) ఆదేశాల మేరకు వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది 'నీ ఓటు..నీ భవిష్యత్తు' కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్, బస్టాండ్, బ్యాంకులు, పోస్టాఫీసు, కళాశాలలు, ముఖ్య కూడళ్లలో వాల్‌పోస్టర్లను సోమవారం అతికించారు. ఏపీఎం సనపల ప్రసాదరావు మాట్లాడుతూ.. ఓటర్లలో చైతన్యం కలిగించేందుకు, వారికి ఓటుపై అవగాహన పెంచేందుకు ఇటువంటి ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు.

# సమాజంపై అవగాహన అవసరం

కాశీబుగ్గ: విద్యార్థులకు సమాజంపై అవగాహన అవసరమని ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రవీణకుమారి అన్నారు. మున్సిపాలిటీ మూడోవార్డు పరిధి పెంటిపద్ర గిరిజన గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ అగ్గున మేఘన మాట్లాడుతూ.. విద్యార్థి దశనుంచే ఉన్నత భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలన్నారు. వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వార్డు కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ సవర రాంబాబు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో పి.ఆనందరావు, ఎం.మాధవి, పి.జయమ్మ, అధ్యాపకులు బి.ధర్మారావు, ఆర్.వందన, జె.తిరుపతి ఉన్నారు.



వలంటీర్లకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ మేఘన, ప్రిన్సిపాల్ ప్రవీణాకుమారి

## ధర్మనీలాపురంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



మాట్లాడుతున్న గోవిందమ్మ

టెక్కలి రూరల్: ధర్మనీలాపురం గ్రామంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్-3 యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిదమ్మ ప్రారంభించారు. ఈనెల 24వ తేదీ వరకు గ్రామం పరిధిలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సతీష్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-3 ప్రోగ్రామ్ అధికారి డి.వాసుబాబు ఉన్నారు.

# సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి

● మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్



మాట్లాడుతున్న సాయిరాజ్

ఇచ్ఛాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాయంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సూచించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో బూత్ కన్వీనర్లు, కోకన్వీనర్లు, బూత్‌కమిటీలు, స్థానిక నాయకులు, వార్డు కౌన్సిలర్లతో పట్టణంలోని 8, 14, 15 వార్డుల్లో సోమవారం సాయంత్రం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, పట్టణ జేసీఎస్ అధ్యక్షుడు సాలిన డిల్లి, కౌన్సిలర్లు పి.మధుమూర్తి, పి.తేజేశ్వరరావు, ముఖ్యనాయకులు పిలక సంతు, నీలాపు డిల్లి, పిలక విజయ్‌భాస్కర్, రాంజీ, ఈశ్వర్‌రెడ్డి, కాళ్ల సత్యం, దక్కత లోకనాథం, గాంధీ, కె.దేవ, కె.మదన్, బుడ్డు, ఎన్.మదన్‌కుమార్ పాల్గొన్నారు..

## ఘనంగా ఎల్లమ్మ జాతర

సంతబొమ్మాళి: మర్రిపాడు ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు ఎల్లమ్మతల్లిని దర్శించుకున్నారు. భారీగా వచ్చిన భక్తులతో జనసంద్రంగా మారింది. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు చేపట్టారు. సత్యసాయిబాబా, విశాఖతరంగిణి సభ్యులు భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. నౌపడ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రచారం చేస్తున్న నాయకులు

మందస: సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని చేసిందని నాయకులు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అధికారాన్ని ఇవ్వాలని ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు కోరారు. మూలిపాడు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలతో వారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని అందించామన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ పేద, బడుగు, బలహీన, దళిత, గిరిజన అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. కోవిడ్ మహమ్మారి అతలాకుతం చేసినప్పటికీ మొక్కవోని దీక్షతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి బాడ జగన్నాయకులు, బూత్ కమిటీ అధ్యక్షుడు తెలుకుల డొంబురు, పార్టీ నాయకులు దద్ద కిరణ్‌కుమార్, కలిగాన ప్రశాంత్, దట్టి నీలయ్య, టింక పాపారావు, గుసిరి నాగేశ్వరరావు, తెలుకుల జగన్నాథం, బైలాడు చైనీ ఉన్నారు.

# స్ట్రాంగ్ రూముల్లో పకడ్బందీగా ఏర్పాట్లు

● 315 పోలింగ్ కేంద్రాల మెటీరియల్ భద్రపరిచేందుకు చర్యలు



స్ట్రాంగ్ రూమ్ వద్ద ఈవీఎంలు తనిఖీ చేసేందుకు ఏర్పాటు చేసిన రేండమైజేషన్ విభాగం



స్ట్రాంగ్ రూమ్‌లో మెటీరియల్‌ను భద్రపరిచేందుకు చేసిన ఏర్పాట్లు

టెక్కలి: ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కేటాయించిన విధుల్లో అధికారులు బిజీగా ఉన్నారు. టెక్కలి నియోజకవర్గానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. నియోజకవర్గంలో 315 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి అవసరమైన మెటీరియల్‌ను భద్రపరిచేందుకు ఒక్కో గదిలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవీఎంలు తనిఖీ చేసేందుకు రేండమైజేషన్ గదితో పాటు 315 పోలింగ్ కేంద్రాలతో పాటు అదనంగా మరో 75 ఈవీఎంలు వాటికి అవసరమైన మెటీరియల్‌ను భద్రపరిచేందుకు గదులను కేటాయించారు.

# సంక్షేమ సారథికి అండగా ఉందాం



ప్రచారం చేస్తున్న నాయకులు

కోటబొమ్మాళి: మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో టెక్కలి అసెంబ్లీ, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్‌కు ఓట్లువేసి గెలిపించుకోవడం ద్వారా మరోసారి సంక్షేమసారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుద్దామని పార్టీ మండల కన్వీనర్ నూక సత్తిరాజు, పలువురు నాయకులు కోరారు. ఎత్తురాళ్లపాడు పంచాయతీలో 'మేము సిద్ధం-మాబూత్ సిద్ధం'కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించి ఎన్నికల ప్రచారం చేపట్టారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లేశ్వరరావు, స్థానిక సర్పంచ్ తలగాన గణపతిరావు, ఎంపీటీసీ సభ్యుడు సింగూరు వాసు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, ఏఎంసీ డైరెక్టర్ మెండ నర్సింగరావు, నాయకులు సుంకరి జనార్దన, తర్ర కామినాయుడు, దుక్క రామక్రిష్ణ, రాంపాత్రుని శివారెడ్డి, మెట్ట సింహాచలం, ఎస్.వినోద్, నేతింటి సింహాచలం, గూట్ల లక్ష్మణరావు, ఎస్.వి.రమణ, మెట్టు వాసు, మూల మోహన్, మక్క నారాయణరావు ఉన్నారు.

## ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్‌ఓ సుదర్శన్‌దొర

ఇచ్ఛాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి సుదర్శన్ దొర అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలంలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాలకు చెందిన ఏపీఎం, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లతో పాటు వైఎస్సార్ క్రాంతి పథం సీసీలతో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో 1061 నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వివిధ రాజకీయ పార్టీల జెండాలు, గోడపత్రికలు తొలగించాలని సూచించారు. నియమించిన సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటే ఎన్నికలకు సంబంధించి అవసరమైనప్పుడు అదనపు బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుందని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎం.భాస్కర అప్పారావు, ఎన్నికల ఉప తహసీల్దార్ బి.శ్రీహరి పాల్గొన్నారు.

# మంత్రి అప్పలరాజుకు కృతజ్ఞతలు



మంత్రి అప్పలరాజు నుంచి స్థలానికి చెందిన పట్టాను అందుకుంటున్న సంఘ సభ్యులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు పరిసర ప్రాంతంలో జీడిపప్పు రద్దుల సంఘం కార్యకలాపాల కోసం అవసరమైన భవనం కోసం స్థలాన్ని కేటాయించారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కృషితో ఇది సాధ్యమైంది. దీంతో మంత్రి అప్పలరాజును సంఘ సభ్యులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం అధ్యక్షులు మార్పు ఆదినారాయణ, కార్యదర్శి పట్నాన సోమబాబు, కోశాధికారి రమణ, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ మహిళా అధ్యక్షురాలు రోణంకి శాంతికుమారి ఉన్నారు.

## ఫ్లాగ్‌మార్చ్‌లో జిల్లా కలెక్టర్



ప్రశాంత ఎన్నికలకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కోటబొమ్మాళి మండల కేంద్రం మెయిన్ రోడ్డులో పోలీసు బలగాలతో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్రమీనా, టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమార్, తహసీల్దార్ పి.లచ్చపాత్రుడు, ఎంపీడీవో వై.పద్మజ, ఎస్సై మహమ్మద్ అలి ఉన్నారు.

-కోటబొమ్మాళి

### పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యూ.లత అన్నారు. కొండపల్లిలో పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.